

ప్రేమ పెళ్లికి ఒప్పుకోలేదని ఆత్మహత్య



రాంరాబు(ఫైల్)

కొత్తకోట, సెప్టెంబరు 10: ప్రేమ వివాహానికి కుటుంబ సభ్యులు నిరాకరించడంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండలం సంకిరెడ్డిపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రాంరాబు(22) ఓ అమ్మాయిని ప్రేమించాడు. ప్రేమ పెళ్లికి కుటుంబ సభ్యులు నిరాకరించారు. దాంతో రాంబాబు గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పొలాలకు వెళ్లిన రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

అడ్డగోలుగా సెల్లార్లు

- ఉమ్మడి జిల్లాలోని పట్టణాల్లో అనుమతులు, అవసరం లేకున్నా నిర్మాణం
- పట్టించుకోని నిబంధనలు
- పార్కింగ్‌కు కాకుండా వాణిజ్య అవసరాల కోసం వినియోగం
- కాసుల కక్కుర్తితో చర్యలు తీసుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు
- రోడ్లపైన పార్కింగ్‌తో ట్రాఫిక్ జామ్



మహబూబ్‌నగర్ పట్టణంలోని ప్రధాన రహదారి పక్కన సెల్లార్లలో కొనసాగుతున్న దుకాణాలు

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రోజురోజుకు పట్టణీకరణ పెరుగుతోంది. ప్రజల అవసరాలకు తగ్గట్లుగా పట్టణాలు విస్తరిస్తున్నాయి. బహుళ అంతస్థుల భవనాలు, పెద్ద పెద్ద షాపింగ్ కాంప్లెక్సులు వస్తున్నాయి. రాష్ట్రంలో వ్యాపారాల చైన్ కలిగిన వారు కూడా టైర్ 2, 3 పట్టణాల్లో తమ వ్యాపార విస్తరణకు ప్రణాళికలు చేసుకుంటున్నారు. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా నిబంధనల ప్రకారం భవనాలను నిర్మించాలి. పార్కింగ్ నుంచి మొదలుకుని అక్కడికి వచ్చే వినియోగదారులకు, ఆ పక్కన రోడ్డుపై వెళ్లే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలి. కానీ అలాంటి నిబంధనలను మునిసిపాలిటీల అధికారులు అమలు చేయడం లేదు. కాసుల కక్కుర్తితో అడ్డగోలుగా అనుమతులు ఇచ్చేస్తున్నారు. అనుమతులు తీసుకోకుండా నిర్మించినా.. ఆ నిర్మాణాలు వారి కళ్ల ఎదుటే జరిగినా పట్టింపు ఉండటం లేదు. ప్రధానంగా సెల్లార్ నిర్మాణాలకు సంబంధించి ఎక్కడా ప్రభుత్వ నియమాలను పాటించడం లేదు. పట్టణాల్లోని ప్రధాన రోడ్లలో ఈ సమస్య ఎక్కువగా ఉంటోంది. ఏదైనా భవనానికి సెల్లార్ నిర్మించాలంటే కనీసం 750 చదరపు అడుగుల బిల్టప్ ఏరియా ఉండాలి. కానీ 100 స్వేయర్ ఫీట్ల వెడల్పు ఉన్న భవనాలకు కూడా సెల్లార్లు నిర్మించుకుంటున్నారు. అలాగే సెల్లార్ నిర్మాణం సమయంలో మట్టి నమూనాలు, ఫైర్ సేఫ్టీ, భవనం చుట్టూ అగ్నిమాపక వాహనం తిరిగేందుకు డ్రైవ్ వే ఉండాలి. అవన్నీ పరిశీలించిన తర్వాతనే అనుమతులు మంజూరు చేయాల్సి ఉంటుంది. కానీ మునిసిపాలిటీ అధికారుల ఉదాసీన వైఖరితో అడ్డగోలు నిర్మాణాలు చేపడుతున్నారు. నిర్మాణం మొదలైన సమయంలోనే అడ్డు కుంటే.. తర్వాత దాన్ని కూల్చడం, బాధితులు కోర్టుకు పోవడం వంటి సమస్యలు ఉండవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

వాణిజ్య అవసరాలకు వినియోగం

కొద్ది రోజుల కిందట ఢిల్లీలోని రావూస్ ఐఏఎస్ అకాడమీ సెల్లార్‌లో కోచింగ్ సెంటర్ నిర్వహిస్తుండగా.. అకస్మాత్తుగా వరద ముంచెత్తడంతో ముగ్గురు సివిల్స్ అభ్యర్థులు మృతి చెందారు. కేవలం సెల్లార్‌లో ఉండటం వల్లనే ఆ ముగ్గురు ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. నిబంధనల ప్రకారం సెల్లార్‌ను కేవలం పార్కింగ్ కోసం మాత్రమే వినియోగించాలి. పెద్ద భవన సముదాయాలకు వచ్చే వారి సంఖ్య కూడా ఎక్కువగా ఉంటుంది కాబట్టి.. వారి వాహనాలు రోడ్డుపైన పార్క్ చేస్తే ఇతర వాహనదారులకు ఇబ్బందులవుతాయి. కాబట్టి, ఆ మేరకు సెల్లార్ అవసరం ఉంటుంది. ప్రస్తుతం పట్టణాల్లో నాలాలు, చెరువులు ఆక్రమణకు గురికావడంతో భారీ వర్షాలు కురిసినప్పుడు వరద పోయే దారి లేక.. జనావాసాలు ముంపునకు గురవుతున్న విషయం తెలిసిందే. అయితే సెల్లార్లను పార్కింగ్ కోసం కాకుండా వాణిజ్య అవసరాలు, గోదాంలు, ప్రజలు ఉండటం కోసం అద్దెలకు ఇస్తుండటంతో చాలా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. మెయిన్ రోడ్ల వెంట సెల్లార్లను వాణిజ్య అవసరాల కోసం వినియోగించడం వల్ల రోడ్లపైనే వాహనాలను పార్క్ చేయాల్సిన అవసరం ఏర్పడుతోంది. దీనివల్ల ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆ దుకాణాల కోసం వచ్చేవారి వాహనాలు రోడ్లపైన పార్క్ చేయడం వల్ల పోలీసులు చలాన్లు విధిస్తున్నారు. పెద్ద పెద్ద ఆస్పత్రులు, కళాశాలలు, వ్యాపార సముదాయాలన్నింటిలోనూ ఈ సమస్య తీవ్రంగా ఉందని చెప్పారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

మునిసిపాలిటీ నూతన చట్టంలో భాగంగా 2021లో సెల్లార్ల అక్రమ నిర్మాణాలు అరికట్టడం, ఉన్న వాటికి నోటీసులు ఇచ్చి తొలగించడం కోసం ప్రభుత్వం ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీలు ఇప్పటివరకు ఎక్కడా అక్రమంగా నిర్మించిన సెల్లార్‌ను తొలగించ లేదు. మహబూబ్‌నగర్ మునిసిపాలిటీలో 120 చోట్ల అనుమతులు లేకుండా సెల్లార్లను నిర్మించారని గుర్తించి, నోటీసులు జారీ చేశారు. అందులో కేవలం రెండు సెల్లార్లకు మాత్రమే అనుమతి ఉండటం గమనార్హం. మహబూబ్‌నగర్-రాయిచూర్ ప్రధాన రహదారిలో వందల కొద్ది సెల్లార్ల నిర్మాణాలు ఉన్నాయి. వాటన్నింటినీ వ్యాపార అవసరాల కోసం వినియోగిస్తున్నారు. షోరూంలు, ఆస్పత్రులు తదితరాలు ఇందులో ప్రధానమైనవి. పద్మావతి కాలనీ, న్యూటౌన్, ఎంబీసీ కాంప్లెక్స్, ఏనుగొండ, శ్రీనివాస కాలనీ, మెట్టుగడ్డ, అశోక టాకీస్ చౌరస్తాల్లోని సెల్లార్లలో వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. వనపర్తి పట్టణంలో 40 వరకు సెల్లార్ల నిర్మాణాలకు అనుమతులు లేవని అధికారులు గుర్తించారు. కానీ ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదు. అచ్చంపేటలో తొమ్మిది భవనాల్లో సెల్లార్లు నిర్మించగా.. ఎక్కడ కూడా పార్కింగ్ కోసం వినియోగించడం లేదు. గద్వాలలో గుర్తించిన సెల్లార్లు 15 వరకు ఉన్నాయి. దరఖాస్తు సమయంలో పార్కింగ్ కోసమని చెప్పి.. తర్వాత వాణిజ్య అవసరాల కోసం వినియోగిస్తున్నారు. టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఉన్నా చర్యలు మాత్రం ఉండటం లేదు. అయిజ పట్టణంలో కూడా సెల్లార్లను అద్దెకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. కల్వకుర్తి మునిసిపాలిటీలో ఎనిమిది సెల్లార్లు ఉండగా.. ఒక్కదానికే అనుమతులు ఉన్నాయి. మిగతావాటిలో కూడా వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. జడ్చర్ల మునిసిపాలిటీలోని సిగ్నల్‌గడ్డ, న్యూ బస్‌స్టాండ్ ప్రాంతాల్లో వ్యాపార అవసరాల కోసం వినియోగిస్తున్నారు.

గుడుంబాపై స్పెషల్ ఫోకస్



సమావేశంలో మాట్లాడుతున్న కమలాసన్ రెడ్డి

- ఇతర రాష్ట్రాల నుంచి మద్యం రాకుండా చెక్‌పోస్టుల వద్ద నిఘా
- ఉమ్మడి పాలమూరులో డ్రగ్స్ వినియోగం తక్కువే
- దూల్‌పేట నుంచి గంజాయి రాకుండా చర్యలు
- ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్ రెడ్డి

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 10: నాటు సారాను పూర్తిగా నిర్మూలించేందుకు ఎక్సైజ్‌శాఖ అంకితభావంతో పని చేస్తుందని, ఉమ్మడి పాలమూరులోని రెండు జిల్లాలో ఇప్పటికే సంపూర్ణంగా సారా బంద్ చేయించడం జరిగిందని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్ అన్నారు. రెండు మూడు నెలల్లో మిగతా జిల్లాల్లో కూడా పూర్తిగా అరికడతామన్నారు. మంగళవారం సమీకృత అధికారుల జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుడుంబాపై స్పెషల్ ఫోకస్ పెట్టడం జరిగిందన్నారు. నాటు సారా, కల్తీకల్లు సేవించడం వల్ల జిల్లాలో అనారోగ్యాల బారిన పడుతున్న కుటుంబాల సంఖ్య పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తుందన్నారు. డ్రగ్స్ వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించామన్నారు. గంజాయి వాడకంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఇదివరకు హైదరాబాద్‌లోని దూల్‌పేట నుంచి గంజాయి సరఫరా అయ్యేదని, ఆపరేషన్ దూల్‌పేట పేరుతో నెల రోజుల పాటు దాడుల నిర్వహించి ఆరు గ్యాంగ్‌లను జైలుకు పంపించామన్నారు. ప్రస్తుతం 99 శాతం నియంత్రించామన్నారు. ఎక్సైజ్ శాఖ పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుని, పాలమూరును మత్తు పదార్థాల రహిత జిల్లాగా మార్చేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో గంజాయి రవాణ, సారా తయారీ, కల్తీ కల్లుపై రానున్న రోజుల్లో ఉక్కుపాదం మోపుతామన్నారు. సారా తయారీకి వినియోగిస్తున్న బెల్లం, ఆలం, కల్తీ కల్లుకు వినియోగించే అల్ప్రాజోలం పట్టుకోవాలని కమలాసన్ చెప్పారు. ఇతర జిల్లాలతో పోలిస్తే ఉమ్మడి పాలమూరు జిల్లాలో డ్రగ్స్ పూర్తి స్థాయిలో కంట్రోల్‌లో ఉందని ఎక్సైజ్ అధికారుల పని తీరును ప్రశంసించారు. ఇతర రాష్ట్రాలనుంచి జిల్లాలోకి మద్యం రాకుండా చెక్‌పోస్టల వద్ద నిఘా పెంచాలన్నారు. ఉమ్మడి జిల్లాలోని కృష్ణ, నందిన్నె చెక్‌పోస్టల వద్ద మరింత నిఘా పెంచి, మద్యం అక్రమంగా రవాణా కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆగస్టు నాటికి 15 కేసులు నమోదు చేసి, కొంత మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఉమ్మడి జిల్లాలో ఆరు గంజాయి కేసులు నమోదుచేసి, 11 మందిని అరెస్ట్ చేశారన్నారు. బెల్ట్ దుకాణాలపై చర్యలు తీసుకుంటున్నామని, వాటికి సంబంధించి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 254 కేసులు నమోదు చేశామన్నారు. సమావేశంలో జాయింట్ కమిషనర్ ఖురేషి, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్లు విజయభాస్కర్‌రెడ్డి, గాయత్రి పాల్గొన్నారు.

గంజాయి
కేరాఫ్ గద్వాల

- హైదరాబాద్, రాయిచూరు, బెంగళూరు, గోవా నుంచి తెచ్చి విక్రయం
- యువతే టార్గెట్
- కొన్ని టీ స్టాళ్లతో పాటు కాలనీల్లో దందా
- ఓ రాజకీయ పార్టీకి చెందిన ఇద్దరు చోటా నాయకుల ప్రధాన పాత్ర





గద్వాల క్రైం, సెప్టెంబరు 10: జోగులాంబ గద్వాల జిల్లాలో గంజాయి సిగరెట్లతో పాటు గంజాయి ప్యాకెట్లను ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి, ఇక్కడి యువతకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో గంజాయి మొక్కలను పెంచుతుండగా ఎక్సైజ్ అధికారులు గుర్తించి, పూర్తి స్థాయిలో నిర్మూలించారు. దాంతో అధికారుల కన్ను గప్పి, కొంతమంది యువతతో పాటు ఓ రాజకీయ పార్టీకి చెందిన ఇద్దరు చోటా నాయకులు గంజాయి సిగరెట్లు, గంజాయి పదార్థాలను ఇతర ప్రాంతాల నుంచి తెప్పించి విక్రయిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా వాటిని జిల్లా కేంద్రంలో యువతకు అంటగడుతున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ గంజాయి బాధితులు వందల సంఖ్యలో ఉన్నట్లు సమాచారం. తమ కింద ఉండే యువకులతో విక్రయిస్తూ రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. రాయిచూర్, హైదరాబాద్‌తో పాటు కొన్నిసార్లు గోవా, బెంగళూరు నుంచి గంజాయి పదార్థాలను తెప్పిస్తున్నట్లు సమాచారం.

గంజాయి అలవాటున్న కిడ్నాప్ కేసు నిందితుడు!

జిల్లా కేంద్రంలో ఇటీవల బాలికల కిడ్నాప్ కేసులో ఉన్న ఓ యువకుడు కూడా గత కొంతకాలంగా జిల్లా కేంద్రంలో గంజాయి వాడుతూ, ఇతరులకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. వీరితో పాటు ఇటీవలే ఉన్నత చదువులకు హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు వెళ్లిన యువతకు అక్కడ కొంత మంది గంజాయిని అలవాటు చేసినట్లు ఇక్కడి ఎక్సైజ్ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గంజాయికి అలవాటు పడ్డ కొందరు కొన్ని యాప్‌ల ద్వారా డ్రగ్స్‌ను ఆన్‌లైన్‌లో తెప్పించుకుంటున్నారని సమాచారం.

జిల్లా కేంద్రంలో అధికంగా..

జిల్లా కేంద్రంలో చింతలపేట, వడ్డెవీధి, బీసీ కాలనీ, గంజిపేట, రెండో రైల్వేగేట్ ప్రాంతాలతో పాటు మరికొన్ని కాలనీల్లో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నట్లు అధికారుల నిఘాలో తేలింది. ఇక్కడ ఉన్న కొందరు యువకులు తమ పేర్లు మార్చుకొని వాటిని కొని, తమ కింద ఉండే వారితో వివిధ ప్రాంతాలలో విక్రయిస్తున్నారని సమాచారం. కొన్ని టీ పాయింట్స్ దగ్గర సిగరెట్ తాగేవారికి గంజాయి సిగరెట్లు అలవాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇంత జరుగుతున్నా పోలీసులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. తమ పిల్లలు గంజాయి బారిన పడకుండా తల్లిదండ్రులు నిఘా ఉంచాల్సిన అవసరం ఉంది.

గంజాయి నిర్మూలనకు కృషి

జోగులాంబ గద్వాల జిల్లాలో గంజాయి పదార్థాలను యువత ఉపయోగించకుండా చర్యలు చేపడతాం. జిల్లా కేంద్రంలోని అనుమానం ఉన్న కాలనీలలో సిబ్బందితో నిఘా ముమ్మరం చేస్తాం. గంజాయి సిగరెట్లు, చాక్లెట్లు, హుక్కా తదితర మత్తు పదార్థాలు ఎక్కడి నుంచి వస్తున్నాయనే విషయాలపై ఆరా తీస్తాం. యువత పెడదారిన పడకుండా తల్లిదండ్రులు నిఘా ఉంచాలి. యువత గంజాయి బారిన పడి జీవితాలు నాశనం చేసుకోవద్దు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలి.

- గణపతి రెడ్డి, ఎక్సైజ్ సీఐ

బాలికల్లో ఆత్మవిశ్వాసం కోసం
కరాటే శిక్షణ



హన్వాడ మండలం చిన్నదర్‌పల్లి ఉన్నత పాఠశాలలో బాలికలకు కరాటే శిక్షణ ఇస్తున్న మాస్టర్(ఫైల్)

- ఉమ్మడి జిల్లాలో 574 పాఠశాలలు ఎంపిక
- రూ.86.10 లక్షల నిధులు మంజూరు
- వచ్చే నెల నుంచి ప్రారంభం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 10: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలికల్లో ధైర్యం నింపి, తమను తాము రక్షించుకునేలా ప్రభుత్వం వారికి కరాటే శిక్షణ ఇప్పించనుంది. పాఠశాల విద్యాశాఖ, సమగ్రశిక్షా అభియాన్ సమన్వయంతో విద్యార్థినులకు మూడు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. రాణి రూన్సీ లక్ష్మీబాయి ఆత్మరక్షణ ప్రశిక్షణ్ పేరుతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 574 పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. ప్రస్తుత సమాజంలో చోటు చేసుకుంటున్న కొన్ని అవాంఛనీయ ఘటనలు కలవరపెడుతున్నాయి. విద్యార్థినులు, యువతులపై పోకిరీల ఆగడాలు, వేధింపులు పెరగడంతో తమను తాము రక్షించుకునేందుకు ఆత్మ రక్షణ విద్యను నేర్పించనున్నారు. దీని ద్వారా వారిలో శారీరక ధృడత్వంతో పాటు ఆత్మవిశ్వాసం, మానసిక ఉల్లాసం కలుగనుంది. గతంలో కేజీబీవీలలో ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. ప్రస్తుతం ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు బాలికలకు ఎంపిక చేసిన మాస్టర్లతో శిక్షణ ఇప్పించనున్నారు. మహిళా కరాటే మాస్టర్లుకు అవకాశం కల్పించనున్నారు.

నెలకు 12 రోజులు శిక్షణ

ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఈ విద్యా సంవత్సరం ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, కేజీబీవీలు, గురుకులాలు, మాడల్ స్కూల్స్ మొత్తం 574 పాఠశాలల్లో కరాటే శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ గత ఆగస్టు 30న ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల చివరి వారం నుంచి(సెలవు రోజులు పోను) మూడు నెలల పాటు ఫిబ్రవరి వరకు శిక్షణ కొనసాగనుంది. వారంలో మూడు రోజుల పాటు నెలకు 12 రోజులు శిక్షణ ఉంటుంది. బోధనకు ఆటంకం కాకుండా అనువైన సమయంలో శిక్షణ ఇస్తారు. శిక్షణ ఇచ్చే కరాటే మాస్టర్ల నియామకం కోసం విద్యాశాఖ ఉత్తర్వులు కూడా జారీ చేసింది. శిక్షణకు సంబంధించి ఉమ్మడి జిల్లా విద్యాశాఖ మొత్తం రూ.86.10 లక్షలు మంజూరు చేసింది. ఒక్కో పాఠశాలకు రూ.15 వేల చొప్పున శిక్షకులకు మూడు నెలలకు గాను నెలకు రూ.5,000 చొప్పున ఇస్తారు.

కరాటే శిక్షణకు ఎంపికైన పాఠశాలల వివరాలు

జిల్లా	పాఠశాలల సంఖ్య	నిధులు (రూ.లక్షల్లో..)
మహబూబ్‌నగర్	140	21
జోగులాంబ గద్వాల	94	14.10
నాగర్‌కర్నూల్	151	22.65
నారాయణపేట	98	11.70
వనపర్తి	111	16.65

గతంలో కేజీబీవీల్లో ఇచ్చాం..

విద్యార్థినుల్లో ధైర్యం పెంపొందించేందుకు గతంలో విద్యాశాఖ ఆదేశాల మేరకు అన్ని కేజీబీవీల్లో కరాటే శిక్షణ ఇప్పించాం. ఈ శిక్షణతో బాలికల్లో ఆత్మరక్షణ, ఆత్మవిశ్వాసం పెరిగింది. ఈ శిక్షణ పాఠశాల్లో చదివే విద్యార్థినులకు ఇవ్వడం మంచిది.

- బైకాని బాలుయాదవ్, సెక్టోరియల్ అధికారి

శిక్షణకు ఏర్పాట్లు

ఎంపిక చేసిన పాఠశాలల్లో బాలికలకు మూడు నెలల పాటు ఆత్మరక్షణపై శిక్షణా తరగతులు నిర్వహించనున్నాం. కరాటే మాస్టర్లను ఎంపిక చేస్తున్నాం. మహిళా మాస్టర్లకు అవకాశం ఉంటుంది. ఈ శిక్షణతో బాలికల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- రవీందర్, డీఈవో మహబూబ్‌నగర్

ఆకలి బాధతో గుర్తు తెలియని
మహిళ మృతి

- భూత్పూర్ మండలం తుల్జాభవాని తండాలో ఘటన



మృతి చెందిన గుర్తు తెలియని మహిళ

భూత్పూర్, సెప్టెంబరు 10 : ఆకలి బాధ తట్టుకోలేక ఓ గుర్తు తెలియని మతిస్థిమితం కోల్పోయిన మహిళ మృతి చెందిన సంఘటన మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ చంద్రశేఖర్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కొత్తమొల్గర గ్రామ శివారులోని తుల్జాభవాని తండా పరిసరాల్లో కొద్దిరోజుల నుంచి ఓ గుర్తు తెలియని మహిళ(50) తిరుగుతోంది. ఆమె తిరగడం కొత్తమొల్గర గ్రామ ఉపాధి హామీ కూలీలు గుర్తించారు. మంగళవారం ఉదయం తండా సమీపంలో రోడ్డు పక్కన ఆమె అచేతనంగా పడి ఉండగా కూలీలు చూశారు. ఆ మహిళ ఆకలి ఆకలి అంటూ ప్రాణం వదిలినట్లుగా ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ బాలమాసయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎర్రబారిన పత్తి

- అధిక వానలతో పంటకు తీవ్ర నష్టం
- రాలుతున్న పూత, పిందె
- ఆందోళనలో రైతులు



తాడూరు మండలం యాదిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో ఎరుపు రంగులోకి మారిన పత్తి పంట



సిర్సవాడలో రాలిపోయిన పూత, పిందె

తాడూరు, సెప్టెంబరు 10: ఇటీవల కురిసిన వరుస వర్షాలకు పత్తి పంటలు దెబ్బతిన్నాయి. దాంతో దిగుబడిపై ప్రభావం చూపనుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వానాకాలంలో నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలో 18 వేల ఎకరాలకుపైగా పత్తి పంట సాగు చేశారు. ఒక ఎకరాకు ఇప్పటివరకు దాదాపుగా రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడులు పెట్టామని చెప్పారు. పంటలు బాగున్నాయని ఆనందపడుతున్న సమయంలో వర్షాలు రావడంతో పరిస్థితి తారుమారైందని అంటున్నారు. అధిక వానలకు పంటలో తేమ శాతం అధికమై పూత, పిందెలు రాలుతున్నాయని వాపోతున్నారు. ఉన్నవి మురిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితిని చూస్తే ఎకరాకు నాలుగు నుంచి ఆరు క్వింటాళ్ల పత్తి కూడా వచ్చే పరిస్థితి లేదని అంటున్నారు. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

23 సెల్‌ఫోన్‌ల రికవరీ

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 10 : టూటౌన్ పరిధిలో పోగొట్టుకున్న 23 సెల్‌ఫోన్‌లను సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసులు రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. ఈ మేరకు మంగళ వారం టూటౌన్ సీఐ ఎజాజుద్దీన్ తన కార్యాల యంలో బాధితులకు ఫోన్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ సెల్‌ఫోన్‌లు పోయిన పలువురు మీసేవలో అప్లై చేసుకుని టూటౌన్‌కు వచ్చి ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూ టౌన్ సిబ్బంది కిషన్‌సింగ్, శేఖర్, ర ఘునాథ్‌రెడ్డి, బబ్యానాయక్, మురళి వీటిని సీఈఐ ఆర్‌లో అప్ లోడ్ చేసి ఐఎంఈఐని బ్లాక్ చేసి ఫోన్ లను ట్రాక్ చేశారు. ఇలా 23 ఫోన్‌లను స్వాధీనం చేసుకుని వాటిని బాధితులకు అప్పగించినట్లు తెలిపారు.

జడ్చర్ల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు అభినందనలు

జడ్చర్ల, సెప్టెంబరు 10 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అటానమస్ లభించినందుకు కళాశాల ప్రిన్సిపాల్ సుకన్యను పాలమూరు యూనివర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి అభినందించారు. కళాశాలను మంగళవారం ఆయన సందర్శించారు. అటాన మస్ సాధించడంతో స్వయం ప్రతిపత్తి హోదా లభిస్తుందని, నూతన కోర్సులతో మెరుగైన విద్యను అందించాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ నర్మద, అకడమిక్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసులు, అధ్యాపకులు మహ్మద్ సులేమాన్, డాక్టర్ సదాశివయ్య, ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

వరద బాధితులకు అండగా నిలుద్దాం

జడ్చర్ల, సెప్టెంబరు 10 : ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో వచ్చిన వరదలతో ఎందరో నిరాశ్రులయ్యారని, వారికి అండగా నిలుద్దామని మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య పిలుపునిచ్చారు. జడ్చర్ల మునిసిపాలిటీలో మంగళవారం వరద బాధితుల కోసం విరాళాలను సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరదలతో కార్మికులు ఉపాధి కోల్పోయారని, ఎంతో మంది వలస కార్మికులు నష్టపోయారని వాపోయారు. వారందరికీ అండగా ఉండేందుకు విరాళాలు ఇవ్వాలంటూ పట్టణంలోని దుకాణ సముదాయాలు, కార్యాలయాలలో విరాళాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు మహేష్, నరసింహ, కేశవులు, కృష్ణ, యాదమ్మ, ఇందిరమ్మ, స్వరూప, అంజమ్మ, లక్ష్మీ, లక్ష్మమ్మ, బాలమ్మ పాల్గొన్నారు.

శ్వేతారెడ్డికి కన్నీటి వీడ్కోలు



అంత్యక్రియలకు వచ్చిన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ప్రముఖులు



అంతిమయాత్రలో పాల్గొన్న నాయకులు, గ్రామస్థులు

తిమ్మాజిపేట, సెప్టెంబరు 10 : మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతారెడ్డి అనారోగ్యంతో మృతి చెందడంతో పలువురు ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు మంగళవారం నివాళులు అర్పించి, అంతిమ యాత్రలో పాల్గొన్నారు. శ్వేతారెడ్డి గత కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. పరిస్థితి విషమించడంతో చెన్నైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో సోమవారం రాత్రి మృతి చెందారు. మృతదేహాన్ని స్వగ్రామం ఆవంచకు తీసుకొచ్చారు. అప్పటికే గుమిగూడిన ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులతో ఆవంచ జన సంద్రమైంది. మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ డీకే అరుణ, ఈటల రాజేందర్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, జైపాల్ యాదవ్, రామ్మోహన్‌రెడ్డి, బీరం హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి గ్రామానికి చేరుకొని శ్వేతా రెడ్డికి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. శ్వేతారెడ్డి సర్పంచ్‌గా పనిచేసిన సమయంలో ఆమె ఆత్మీయతను గుర్తు చేసుకొని గ్రామస్థులు కన్నీటి పర్యంతమయ్యారు. శ్వేతారెడ్డిని కడసారి చూసేందుకు పార్టీలకతీతంగా తరలిరావడంతో గ్రామం కిక్కిరిసింది. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జోగు ప్రదీప్, మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు దయాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వేణుగోపాల్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్ బహదూర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లయ్యగౌడ్, నాయకులు మాధవులు తదితరులు ఉన్నారు.



కన్నీటి పర్యంతమైన లక్ష్మారెడ్డిని ఓదారుస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

నేడు ఉమ్మడి జిల్లా ఖోఖో జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 10 : హైదరాబాద్‌లో ఈనెల 13 నుంచి నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ ఖోఖో టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాల, బాలికల జట్ల ఎంపికలను నేడు (బుధవారం) మక్తల్ మండం కర్వెన గ్రామంలో జిల్లా పరిషత్ హై స్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు ఖోఖో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి విలియం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 03-10-2010 కంటే తర్వాత జన్మించిన వారు అర్హులని, 02 అక్టోబరు 2024 వరకు 14 ఏళ్లలోపు ఉండాలన్నారు. ఉదయం 9 గంటలకు పీడీలు నిరంజన్ యాదవ్, రూపలకు రిపోర్టు చేయాలని కోరారు. మరింత సమాచారం కోసం 9985904158 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

మిగులు సీట్లకు స్పాట్ కౌన్సెలింగ్ రేపు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 10 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదు నుంచి తొమ్మిది తరగతులలో మిగులు సీట్ల భర్తీ కోసం ఈ నెల 12న స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి పాలమూరు జిల్లా నోడల్ అధికారి నిర్మల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని నారాయణపేట, మహబూబ్‌నగర్, వనపర్తి, జోగుళాంబ గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో ఉన్న గురుకుల పాఠశాలల్లో సీట్ల భర్తీకి ఈ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. షెడ్యూల్డ్ కులాల విద్యార్థిని, విద్యార్థులు మాత్రమే అర్హులని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల చిట్టబోయినపల్లి గురుకుల పాఠశాలలో నిర్వహించే కౌన్సెలింగ్ ఉమ్మడి జిల్లా విద్యార్థులు హాజరు కావాలని కోరారు. విద్యార్థుల నుంచి 12న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దరఖాస్తులు తీసుకుంటున్నట్లు తెలిపారు.

పీయూ ఉత్తమ అధ్యాపకునికి ఘన సన్మానం



పీయూ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కిశోర్‌ను సన్మానిస్తున్న అధికారులు

పాలమూరు యూనివర్సిటీ, సెప్టెంబరు 10 : పాలమూరు యూనివర్సిటీ మైక్రో బయాలజీ విభాగం అధ్యాపకుడు, పీయూ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కిశోర్‌ను పీయూలో ఘనంగా సన్మానించారు. ఇటీవల రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న నేపథ్యంలో కిశోర్‌ను మంగళవారం పీయూ పరిపాలన భవనం సెమినార్ హాల్‌లో సన్మానించారు. పీయూ రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, పరీక్షల నిర్వహణ అధికారి డాక్టర్ రాజ్‌కుమార్, పీయూ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నూర్జహాన్ బేగం, పీయూ అధికారులు, అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ పాలమూరు యూనివర్సిటీ అధ్యాపకుడిగా 2008 సంవత్సరం నుంచి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులై అప్పటి నుంచి ఎన్నో పరిశోధనలు చేశారని గుర్తు చేశారు. జాతీయ, అంతర్జాతీయ సెమినార్‌లలో అనేక బెస్ట్ అవార్డులు అందుకున్న ఆయన ఈ విద్యాసంవత్సరానికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికవడం గర్వకారణమని తెలిపారు. పీయూ అధికారులు, అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని శవం లభ్యం

పెబ్బేరు, సెప్టెంబరు 10 : మునిసిపాలిటీ పరిధిలోని సాయిబాబా గుడి దగ్గర గుర్తు తెలియని వృద్ధుని శవం లభ్యమైనట్లు ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు. అతని కాలికి గాయమైందని, వృద్ధుని ఆచూకీ తెలిస్తే పోలీసులకు సమాచారం తెలపాలని అన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించామని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

కల్వకుర్తి టౌన్, సెప్టెంబరు 10 : మెట్లపై నుంచి కింద పడి తీవ్ర గాయాలపాలైన బాలుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై మాధవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం పంజుగుల గ్రామానికి చెందిన నాగేంద్ర కుమారుడు నాగరాజు(19 నెలలు) గతనెల 24న అద్దెకు ఉంటున్న ఇంట్లో మెట్లపై నుంచి కింద పడ్డాడు. తీవ్ర గాయాలపాలైన బాలుడిని నీలోఫర్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి బాలుడు మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

దామరగిద్ద, సెప్టెంబరు 10 : నారాయణపేట జిల్లా దామరగిద్ద పీఎస్ పరిధిలో మంగళవార నిర్వహించిన టాస్క్‌ఫోర్స్ దాడుల్లో రేషన్ బియ్యం పట్టుబడింది. ఎస్‌ఐ రాజు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వెంకటేష్ ఆటోలో ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కర్ణాటకకు తరలిస్తుండగా దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేష్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

దామరగిద్ద, సెప్టెంబరు 10 : అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ మంగళవారం పట్టుబడింది. నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం క్యాతన్‌పల్లి గ్రామానికి చెందిన ఈడిగి కృష్ణయ్య అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తుండగా, కానుకూర్తి వద్ద పట్టుబడినట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు. ఈ సందర్భంగా ట్రాక్టర్ డ్రైవర్ ఈడిగి రాములపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి జైలుశిక్ష

వెల్దండ, సెప్టెంబరు 10 : మద్యం తాగి పట్టుబడిన వ్యక్తికి నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి జేఎఫ్‌సీఎం కోర్టు ఒకరోజు జైలుశిక్ష విధించింది. ఎస్సై కురుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం. వెల్దండ మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన దండుగుల శేఖర్ ఈనెల తొమ్మిదో తేదీన పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలో మద్యం తాగినట్లు గుర్తించి, కేసు నమోదు చేశారు. మంగళవారం కేసును విచారించిన అనంతరం జేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి జాడ కావ్య ముద్దాయికి ఒకరోజు జైలుశిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.

భర్త కనిపించడం లేదని భార్య ఫిర్యాదు

ఆత్మకూరు, సెప్టెంబరు 10 : తన భర్త కనిపించడం లేదంటూ భార్య ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. ఆ వివరాలు ఇలా.. మండల పరిధిలోని మేడపల్లి గ్రామానికి చెందిన బడుగుల శ్రీనివాసులు(46) ఈనెల 6న తన కుమారుడిని పాలమూరు కళాశాలలో వదిలిపెట్టేందుకు ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగిరాలేదు. దీంతో అతని భార్య మణెమ్మ ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ అయ్యింది. బంధువులు కుటుంబ సభ్యులు ఇళ్లకు వెళ్లి వెతికినా ఆచూకీ తెలియలేదు. ఈ మేరకు ఆమె మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

పెబ్బేరు, సెప్టెంబరు 10 : అంబులెన్స్‌లో మహిళ ప్రసవించింది. రంగాపురం మండలంలోని నాగరాల గ్రామానికి చెందిన లక్ష్మి(20)కి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేయగా, కడుకుంట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది వాహనంతో వచ్చారు. లక్ష్మిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మగ శిశువుకు జన్మనిచ్చిందని ఈఎంటీ నరేందర్ , పైలెట్ రామవేంద్ర తెలిపారు. వనపర్తి ఎంసీహెచ్ ఆసుపత్రిలో అడ్మిషన్ చేసినట్లు సిబ్బంది తెలిపారు.

యువకుడిపై కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం, సెప్టెంబరు 10 : సామాజిక మాధ్యమాల్లో అసభ్యకరంగా పోస్టులు పెట్టిన శరత్‌బాబు అనే యువకుడిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్సై గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. గత నెలలో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన మహిళలను కించపరిచే విధంగా సామాజిక మాధ్యమాల్లో శరత్‌బాబు అనే యువకుడు పోస్టులు పెట్టాడు. దీంతో రెడ్డి సేవా సమితి నాయకులు గతనెల 27వ తేదీన ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌కు ఆ యువకునిపై ఫిర్యాదు చేశారు. దీంతో శరత్‌బాబును అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు. కాగా, రెడ్డి సేవా సమితి నాయకులు మంగళవారం డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి శరత్‌బాబుపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

'దుందుభీ'కి కొనసాగుతున్న వరద

తాడూరు, సెప్టెంబరు 10 : గత 20 రోజులుగా నిరంతర ప్రవాహంతో దుందుభి నది పరివాహక ప్రాంత గ్రామాల ప్రజలను భయాందోళనకు గురి చేస్తోంది. ఈ ఉధృతి మంగళవారం సైతం అలాగే కొనసాగడంతో సిర్సవాడ-కల్వకుర్తి, సిర్సవాడ-మిడ్జిల్ గ్రామాల రహదారులపై రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులందరూ నది తీరం వద్దకు వచ్చి తిరిగి వెనుదిరిగాల్సిన పరిస్థితి నెలకొంది.

ముంపు గ్రామస్థులకు సాయం అందించండి

- రాష్ట్ర ఇరిగేషన్‌శాఖ మంత్రికి విన్నవించిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



సమస్యలపై ఇరిగేషన్ మంత్రికి వివరిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల న్యూటౌన్, సెప్టెంబరు 10 : ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గద్వాల నియోజకవర్గంలోని చిన్నోనిపల్లి, నాగర్‌దొడ్డి ముంపు ప్రాంతాలు పూర్తిగా వరదనీటిలో మునిగిపోయాయని, వారికి అత్యవసర ఆర్థిక సాయం అందించాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మంగళవారం మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి హైదరాబాద్‌లో రాష్ట్ర ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చిన్నోనిపల్లి, నాగర్‌దొడ్డి ముంపు ప్రాంతాలు పూర్తిగా వరదనీటిలో మునిగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీరికి కేటాయించిన పునరావాస కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించి వీరికి అత్యవసర సాయం అందజేయాలని మంత్రిని ఎమ్మెల్యే కోరారు. ఇరిగేషన్ మంత్రి సానుకూలంగా స్పందించి కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

రాజ్యాంగ రక్షణకు యువత నడుం బిగించాలి

- కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు



మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు

కొల్లాపూర్, సెప్టెంబరు 10 : భారత రాజ్యాంగానికి మతోన్మాద శక్తుల నుంచి ప్రమాదం పొంచి ఉందని, రాజ్యాంగ రక్షణకు యువతరం నడుం బిగించాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు పిలుపునిచ్చారు. మంగళవారం కొల్లాపూర్ కేఎల్ఐ గెస్ట్‌హౌస్‌లో 'రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్లు' అనేక అంశంపై కేవీపీఎస్ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ 110 దేశాల రాజ్యాంగాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి విభిన్న వైవిధ్యాలు కలిగిన దేశంలో దేశ ప్రజలందరినీ ఒకే తాటిపైన నిలబెట్టడానికి కులం, మతం, భాషా ప్రాంతాల కతీతంగా ప్రజలందరికీ సమాన హక్కులు ఉండే విధంగా భారత రాజ్యాంగాన్ని రూపొందించారని ఆయన చెప్పారు. మత విద్వేషాలను రెచ్చగొట్టడం ద్వారా బీజేపీ, ఎంఐఎం పబ్బం గడుపుకుంటున్నాయని తద్వారా ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. దేశ సమైక్యత సమగ్రతల కోసం లౌకిక విలువల కోసం నేటి యువతరం కట్టుబడి ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఎస్సీలలో క్రిమిలేయర్ పెట్టాలనే వాదనను ఆయన తిప్పి కొట్టారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అంతటి కాశన్న, పులిజాల పరుశరాములు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివవర్మ, ఆవాజ్ జిల్లా నాయకులు ఎండి.సలీం, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకుడు సురేందర్, కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎస్.హనుమంతు, మండల నాయకులు సంజీవ్, రాజు, సాయి, శేషు, శివ, రామకృష్ణ తదితరులున్నారు.

దుర్వాసన భరించలేం..

- నాగవరం నుంచి డంపింగ్ యార్డును తరలించాలంటూ స్థానికుల నిరసన
- చెత్త తరలింపు వాహనాలను అడ్డుకున్న వార్డు ప్రజలు, కౌన్సిలర్లు
- రీసైక్లింగ్ సంస్థ నిర్లక్ష్యం వల్లే సమస్య అంటున్న అధికారులు



డంపింగ్ యార్డ్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న నాగవరం ప్రజలు

వనపర్తి టౌన్, సెప్టెంబరు 10 : చెత్త డంపింగ్ యార్డు నుంచి వస్తున్న దుర్వాసనను భరించలేమని వనపర్తి మునిసిపాలిటీలోని నాగవరం కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం వనపర్తి జిల్లా నాగవరం సమీపంలో గల డంపింగ్ యార్డ్‌కు వెళ్తున్న చెత్త తరలింపు వాహనాలను స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, సమీప కాలనీ ప్రజలు అడ్డుకున్నారు. చెత్తయార్డును ఇతర ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేశారు. రోడ్డుపై బైఠాయించడంతో చెత్త తరలింపు వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న కమిషనర్ పూర్ణచందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డి పోలీసుల సహాయంతో ఘటనా స్థలానికి చేరుకుని స్థానికులను, ప్రజాప్రతినిధులను సముదాయించే ప్రయత్నం చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెత్త మురిగి డంపింగ్ యార్డ్ నుంచి దుర్వాసన వస్తున్నదన్నారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, చెత్త రీసైక్లింగ్ సంస్థతో మాట్లాడి సమస్యను పదిహేను రోజుల్లో పరిష్కరిస్తామని ఆయన చెప్పారు.

వ్యాపార కేంద్రంగా మారిన కురుమూర్తి ఆలయం

- రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన బీజేపీ నాయకులు



చిన్నచింతకుంటలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

చిన్నచింతకుంట, సెప్టెంబరు 10 : మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్ గ్రామ సమీపంలో వెలిసిన కురు మూర్తి ఆలయం పూర్తిగా వ్యాపారకేంద్రంగా మారి oదని బీజేపీ నాయకులు ధ్వజమెత్తారు. రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్‌కు ఆఫీసు ఈ మెయి ల్‌కు, రిజిస్టర్‌పోస్టు ద్వారా ఫిర్యాదును పంపారు. ఆ ఫిర్యాదు ప్రతులను మంగళవారం మండల కేంద్ర oలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో విలేకరులకు అందజేశారు. ఆ పార్టీ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి నంబిరాజు, అసెంబ్లీ కన్వీనర్ కుర్వ రమేష్, మండల అధ్యక్షుడు దశరత్, ఓబీసీ మండల ప్రధాన కార్యదర్శి అక్కల సుదర్శన్‌గౌడ్, నరేందర్‌జీ, శ్రీకృష్ణ మాట్లాడుతూ వివరాలను తెలిపారు. ప్రసిద్ధిగాంచిన కురుమూర్తి ఆలయంలో ఆలయ కమిటీ, దేవాదాయ శాఖాధి కారులు కుమ్మక్కై, టెండర్లద్వారా ఎన్నో అక్రమాలకు చేస్తున్నారని తెలిపారు. ఇక్కడ దేవుడి ప్రసాదం పేరు మీద, లడ్డూ, పులిహోరపై ఇష్టారాజ్యంగా ధరల్ని పెంచి, భక్తులను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. పక్కనే ఉన్న మన్యంకొండ ఆలయంలోనూ 100 గ్రాముల లడ్డూకు రూ.10కు విక్రయిస్తుంటే, కురుమూర్తి ఆలయంలో మాత్రం రూ.15కు విక్రయిస్తున్నారని తెలిపారు. పులిహోరకు కూడా వ్యాపార లబ్ధికోసం టెండర్లు పాడి అధిక ధరలకు విక్రయిస్తున్నరని వారు తెలిపారు. ప్రసాదాల నాణ్యతపై గతంలో పలుమార్లు భక్తులు అనేక ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోలేదని, కోట్ల ఆదాయం ఉన్నా ఆలయంలో భక్తులకు ఏమి ఉచితంగా ఇస్తున్నారని వారు ప్రశ్నించారు. టెంకాయలు కూడా రూ.25కు విక్రయిస్తామని చెప్పి, తీరా భక్తులు రద్దీగా ఉండే సమయంలో రూ.30 నుంచి రూ.40కి విక్రయిస్తున్నారని వారు తెలిపారు. పాత రేట్లతో నాణ్యతగా లడ్డూలు తయారు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, భక్తులకు ఆలయం ద్వారానే అం దించే విధంగా చర్యలు తీసుకుంటే భక్తులకు మరింత మేలు జరుగుందని తెలిపారు.

బాంబు స్క్వాడ్ తనిఖీలు

మక్తల్, సెప్టెంబరు 10 : నారాయణపేట ఎస్పీ యోగేష్‌గౌతమ్ ఆదేశాల మేరకు మంగళవారం మక్తల్ పట్టణంలోని బాంబు స్క్వాడ్ బృందం, డాగ్‌స్క్వాడ్‌తో గణేష్ మండపాలు, ప్రధాన చౌరస్తాలు, ప్రార్థనా మందిరాల వద్ద తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా లేదా రెండు మూడు రోజులు ఒకే ప్రదేశాల్లో వాహనాలు ఉంటే, అపరిచిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు.

'అక్రమ నిర్మాణాలను ఆపాలి'

హన్వాడ, సెప్టెంబరు 10 : మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం చిన్నదర్పల్లి వార్డులోని 68 సర్వే నంబర్ భూమిలో కొందరు అక్రమంగా ఇళ్లు నిర్మిస్తున్నారని, వాటిని ఆపాలని ఎమ్మార్పీ ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలరాజు డిమాండ్ చేశారు. మంగళవారం నాయకులు లక్ష్మన్‌నాయక్, ఆశన్న, సత్తయ్య తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో పలుమార్లు ఫిర్యాదు చేసినా నిర్మాణాలు అలాగే చేస్తున్నారని, అధికారులు పట్టించుకోవాలని కోరారు. ఇళ్లు ఉన్న వారే రాత్రికి రాత్రి అక్రమంగా ఇళ్లు నిర్మిస్తున్నారని, వాటిని పూర్తిగా కూల్చాలన్నారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన అవసరం

- ఎస్వీఎస్ వైద్యకళాశాల మానసిక వైద్య విభాగాధిపతి డాక్టర్ అశోక్‌రెడ్డి



ఆత్మహత్యల నివారణపై ప్రదర్శన నిర్వహించిన వైద్య విద్యార్థులు

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), సెప్టెంబరు 10 : సమాజంలో ప్రతీ ఒక్కరు మానసిక ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని ఎస్వీఎస్ వైద్యకళాశాల మానసిక వైద్య విభాగాధిపతి డాక్టర్ అశోక్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎస్వీఎస్ వైద్యకళాశాల, ఆసుపత్రిలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగ విద్యార్థులు వివిధ ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో మనిషి ఒత్తిడులకు లోనవుతూ ఎన్నో మానసిక రోగాల బారిన పడుతున్నాడన్నారు. ఫలితంగా మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురై ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ఆత్మహత్యలే సమస్యకు పరిష్కారం కాదని, మానసిక సమస్యలను నయం చేసేందుకు అవకాశం ఉందన్నారు. కానీ, మానసిక ఆరోగ్యంపై అవగాహన లేకపోవడం వలన చాలా మంది తమ జీవితాలను బలిచేసుకుంటున్నారని పేర్కొన్నారు. ఆత్మహత్య చేసుకోవడం వలన తాను అనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చకపోగా కుటుంబానికి, బంధువులకు తీరని బాధగా మిగిలిపోతారనే విషయాన్ని తెలుసుకోవాలన్నారు. మానసిక రోగాలకు మందులు అందుబాటులో ఉన్నాయని, కౌన్సెలింగ్ ద్వారా కూడా వాటి నుంచి బయటపడవచ్చని తెలిపారు. మానసికంగా ఒత్తిడికి లోనుకావద్దని, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. అనంతరం ఎస్వీఎస్ నర్సింగ్ కళాశాల విద్యార్థులు మానసిక రోగాలు, ఆత్మహత్యలు చేసుకునే సందర్భాలను, వాటిని ఎలా అధిగమించాలని విషయాలపై మైమ్ ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ రెసిడెంట్ డైరెక్టర్ రామిరెడ్డి, కళాశాల రెసిడెంట్ డైరెక్టర్ డాక్టర్ కె.పి.జోషి, ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకట్ రాహుల్, మానసి విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ భార్గవ స్వరాజ్, సీనియర్, జూనియర్ రెసిడెంట్ డాక్టర్లు పాల్గొన్నారు.

జానపద గేయం ఆడియో పోస్టర్ విడుదల



హైదరాబాద్ రవీంద్రభారతిలో ఫోక్ సాంగ్ ఆడియోను విడుదల చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్

పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 10 : హైదరాబాద్ రవీంద్రభారతిలో ఉప్పెన మ్యూజిక్ యూట్యూబ్ పాట 'బోరు బోరున నాది ఇల్లు బీమా దారి' ఫోక్ సాంగ్ ఆడియోను ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, పెద్దకొత్తపల్లి మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ మంగళవారం విడుదల చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం ముష్టిపల్లి గ్రామానికి చెందిన రచయిత, గాయకుడు గాదరి చంద్రశేఖర్, సింగర్ గాదరి లింగమ్మ అతిథుల సమక్షంలో పాటను పాడి విన్పించారు. పాట మంచిగా ఉందని ప్రశంసల జల్లులు కురిపిస్తూ మంత్రి జూపల్లి, మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ గాయకులను అభినందించారు. కనుమరుగవుతున్న జానపదాలను వెలికితీసి మంచి సందేశాన్ని సమాజానికి అందించాలని వారు పిలుపునిచ్చారు. ఉప్పెన మ్యూజిక్ చానల్‌లో వచ్చిన ఆరు గ్యారంటీల కాంగ్రెస్ పాట రచయిత గాదరి చంద్రశేఖర్, సింగర్ గాదరి లింగమ్మ పాడిన పాట ప్రభుత్వం రావడానికి చాలా దోహదపడిందని వారు పేర్కొన్నారు.

రోగి మృతితో వైద్యులతో మృతురాలి బంధువుల వాగ్వాదం

- జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చోటు చేసుకున్న ఘటన

నాగర్‌కర్నూల్ క్రైం, సెప్టెంబరు 10 : జిల్లా ఆసుపత్రికి అనారోగ్యంతో వచ్చిన గొల్ల కురువమ్మ(35) అనే మహిళ మంగళవారం మృతి చెందడంతో మృతురాలి బంధువులు వైద్యులతో వాగ్వాదానికి దిగారు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. రేవల్లి నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని తల్పునూర్ గ్రామానికి చెందిన కురువమ్మ తీవ్ర అనారోగ్యానికి గురి కావడంతో సోమవారం రాత్రి ఆమెను జిల్లా ఆసుపత్రికి తీసుకొచ్చారు. వైద్యులు పరీక్షించి ఆసుపత్రిలో చేర్పించుకున్నారు. మంగళవారం పరీక్షలు చేసి మెరుగైన వైద్యం చేస్తామని సూచించారు. దీంతో తెల్లారేసరికి కురువమ్మ మృతి చెందడంతో బంధువులు వైద్యులతో వాగ్వాదం చేశారు. కొంతమంది వైద్యులు కురువమ్మ పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్య పరీక్షలు చేశామని చెప్పడంతో మృతదేహాన్ని సొంత గ్రామానికి తీసుకెళ్లారు.

ఉపాధి హామీ రికార్డుల పరిశీలన



కూలీలతో వివరాలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా అంబుడ్స్‌పర్సన్ నల్ల జంగయ్య

కల్వకుర్తి, సెప్టెంబరు 10 : కల్వకుర్తి మండలం తర్నికల్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని డీఆర్‌డీవో అంబుడ్స్‌పర్సన్ నల్ల జంగయ్య మంగళవారం తనిఖీ చేశారు. గ్రామంలో ఉపాధి హామీలో 2023లో పనిచేసిన కూలీలకు డబ్బులు రాలేదని డీఆర్‌డీవో పీడీకి గతంలో గ్రామస్థులు ఫిర్యాదు చేయగా తనిఖీ నిమిత్తం ఆయన పంచాయతీ కార్యాలయానికి చేరుకున్నారు. కార్యాలయంలో ఈజీఎస్ రికార్డులను పరిశీలించి, కూలీల వివరాలు గ్రామ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. గ్రామ కార్యదర్శి పొంతన లేని సమాధానం చెప్పడంతో ఆయన ఆగ్ర హం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో మళ్లీ వస్తానని చెప్పి ఆయన వెళ్లిపోయారు. తాళ్ల సురేష్ గౌడ్, బచ్చలకూర శ్రీశైలం తదితరులు పలు సమస్యలను జంగయ్య దృష్టికి తీసుకొచ్చారు.

పోషకాహారంపై అవగాహన

చారకొండ, సెప్టెంబరు 10 : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-5లో మంగళవారం పోషక మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మండల వైద్యాధికారి డాక్టర్ మంజుభార్గవి హాజరై, పోషకాహారంలో లభించే పోషకాల గురించి గర్భిణులకు, బాలింతలకు, ప్రీస్కూల్ చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. బాలింతలు రక్తహీనత రాకుండా ఐరన్ ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రసిదునిసా, సీహెచ్‌వో శేఖర్‌రెడ్డి, హెచ్‌ఈవో ఎన్డీవీచారి, ఏఎన్‌ఎంలు అలివేలు, సరిత, అంగన్‌వాడీ టీచర్ వెంకటమ్మ, ఆశ వర్కర్ రాములమ్మ, గర్భిణులు బాలింతలు పాల్గొన్నారు.

పంటలను కాపాడుకోవాలి



సిర్సనగండ్లలో నీటిలో ఉన్న పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఈవో వంశీ

చారకొండ, సెప్టెంబరు 10 : మండలంలో ఇటీవల కురిసిన వర్షాల వల్ల పొలాల్లో నిలిచే నీటితో పంటలకు నష్టం కలుగుతోందని, వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించి పంటలను కాపాడుకోవాలని ఏఈవో వంశీ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సిర్సనగండ్లలో రైతుల పంట పొలాలను ఆయన పరిశీలించారు. పొలాల్లో వర్షపు నీరు నిలిచి పత్తి పంటకు వేరు వ్యవస్థ దెబ్బతినడంతో రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. పొలాల్లో వర్షపు నీరు బయటకు వెళ్లే విధంగా రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. పంట రక్షణకు సంబంధిత క్రిమి సంహారక మందులు అధికారుల సూచనల మేరకు పిచికారి చేయాలని అన్నారు.

స్నేహితురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



స్నేహితురాలి కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న పూర్వ విద్యార్థులు

లింగాల, సెప్టెంబరు 10 : బాల్య స్నేహితురాలి కుటుంబం ఆపదలో ఉండడంతో చలించిపోయిన 2008-09 విద్యా సంవత్సరం పదవ తరగతి మిత్ర బృందం ఆ కుటుంబానికి అండగా నిలుస్తూ రూ.51,800 పోగు చేయడంతో పాటు 150 కిలోల సన్న బియ్యాన్ని సేకరించి మంగళవారం లింగాల హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో సంధ్యారాణి, వారి ఇద్దరు పిల్లలకు అందించారు. ఇటీవల బాల్య స్నేహితురాలైన సంధ్యారాణి భర్త నఫీస్ గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందాడు. చిన్నతనంలో కలిసి చదువుకున్న బాల్య స్నేహితురాలి కుటుంబాన్ని ఆదుకోవడానికి మిత్రబృందం ఆర్థిక సాయం, నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. జీహెచ్‌ఎం బషీర్‌అహ్మద్, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

పాఠశాలలో వంటగది నిర్మించాలి



ఉప్పునుంతల జడ్పీహెచ్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఉప్పునుంతల, సెప్టెంబరు 10 : ప్రభుత్వ పాఠశాలలో వంటగది నిర్మించాలని, అదేవిధంగా మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగభద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌ను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వంటగది, పరిశుభ్రత, మధ్యాహ్న భోజనం తదితర వాటిని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ పాఠశాలలో వంటగది లేక ఆరు బయట మధ్యాహ్నం వంట చేస్తున్నారని తెలిపారు. అదేవిధంగా వంట కార్మికులకు ఉద్యోగ భద్రతతో పాటు కనీసం వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు తదితరులున్నారు.

పీఆర్టీయూ మండల కమిటీ ఎన్నిక

కల్వకుర్తి టౌన్, సెప్టెంబరు 10 : పీఆర్టీయూ మండల నూతన కమిటీని టీఎన్జీవో భవనంలో మంగళవారం ఎన్నుకున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు. మండల అధ్యక్షుడిగా మర్యాద కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎండీ.రియాజ్, మహిళా ఉపాధ్యక్షురాలిగా స్వప్న, మండల అసోసియేషన్ అధ్యక్షుడిగా అబ్దుల్ వహీద్, కార్యదర్శిగా శంకర్, మహిళా కార్యదర్శిగా జే.రాజ్యలక్ష్మిలను ఎన్నుకున్నట్లు వారు వివరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సూర్యశ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి తుమ్మల సురేందర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు రామచంద్రరావు, ఇతర జిల్లాల నాయకులు, మండల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ



మారేడుమాన్‌దిన్నె గ్రామంలో బోనాలతో పోచమ్మ దేవాలయానికి వెళ్తున్న మహిళలు

పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 10 : మండల పరిధిలోని మారేడుమానుదిన్నె గ్రామస్థులు మంగళవారం బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలోని మహిళలు బోనాల కుండలను అలంకరించి తలపై పెట్టుకుని గ్రామంలో డప్పుల దరువులతో ఊరేగింపుగా పోచమ్మ ఆలయానికి చేరుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి పోచమ్మకు నైవేద్యం సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యురాలు మేకల గౌరమ్మ, మాజీ సర్పంచ్ అరవింద్, విండో డైరెక్టర్ బాలునాయక్, మాజీ ఉప సర్పంచ్ శ్రీధర్‌రావు, గన్నోజు సునీత, కోఆప్షన్ సభ్యుడు కందికొండ బాలస్వామి, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు మంగమ్మ, గ్రామ పెద్దలు గన్నోజు శ్రీకృష్ణాచారి, నాగరాజు, మేకల శంకర్‌యాదవ్ తదితరులున్నారు.



కల్వకుర్తిలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



ఉప్పునుంతలలో చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న రజక సంఘం నాయకులు



పోల్కంపల్లిలో ఐలమ్మ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

మహిళా చైతన్యానికి ప్రతీక చాకలి ఐలమ్మ

- జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఖాజానజీమ్ అలీఅప్సర్
- జిల్లాలో ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాలు
- విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలతో ఘనంగా నివాళులు



కలెక్టరేట్‌లో చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న బీసీ సంక్షేమ శాఖ అధికారులు



జిల్లా కేంద్రంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్/చారకొండ/బల్మూరు/తెలకపల్లి/ఉప్పునుంతల/కల్వకుర్తి/పెద్దకొత్తపల్లి/బిజినేపల్లి/పెంట్లవెల్లి/వంగూరు/కొల్లాపూర్, సెప్టెంబరు 10 : మొక్కవోని ధైర్యం, తెగువతో నాటి రజాకార్ల గుండెల్లో భయం పుట్టించిన చాకలి ఐలమ్మ మహిళా చైతన్యానికి ప్రతీక అని జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఖాజానజీమ్ అలీఅప్సర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 39వ వర్ధంతిని నిర్వహించారు. జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఖాజానజీమ్ అలీఅప్సర్ చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి మహిళలు చాకలి ఐలమ్మను ఆదర్శంగా తీసుకుని సమాజంలో ధైర్యంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో రజక సంఘం జిల్లా అధ్యక్షుడు శాలేశ్వర్, నాయకులు మల్లేష్, బాలస్వామి, బంగారయ్య, కార్యాలయ సిబ్బంది సురేష్, శివప్రసాద్, లక్ష్మయ్య, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

● సీపీఎం ఆధ్వర్యంలో : పార్టీ కార్యాలయంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.శ్రీనివాస్, కందికొండ గీత పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు రామయ్య, అశోక్, వెంకటేష్, నరసింహ, కురుమయ్య, మల్లికార్జున్, సురేష్ తదితరులున్నారు.

● బీఎస్పీ ఆధ్వర్యంలో : పట్టణంలోని హౌసింగ్ బోర్డు బస్‌స్టాప్ వద్ద ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి అంతటి నాగన్న, నాయకులు మోహన్‌రెడ్డి, కళ్యాణ్, బాలనాగులు, నాగేష్, రాముడు, మొగులాల్, విష్ణు, రామకృష్ణ, మధు తదితరులున్నారు.

అదేవిధంగా, చారకొండలోని చెర్కుపల్లి చౌరస్తాలో అమరవీరుల స్థూపం వద్ద రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రజక సంఘం మండల అధ్యక్షుడు పగడాల నందం, పార్టీల నాయకులు పాల్గొన్నారు. బల్మూరు మండలం పోలిశెట్టిపల్లి గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు ఐలమ్మ జీవిత చరిత్రను కొనియాడారు. రజక సంఘం అధ్యక్షుడు సత్యం, భోగరాజు, నరసింహులు, రాములు, బాలస్వామి, ఎట్టయ్య, కురుమూర్తి, రాముడు, సైదులు, హెచ్‌ఎం సోమని, గ్రామ కార్యదర్శి బాలరాజు, గ్రామ యువకులు పాల్గొన్నారు. తెలకపల్లిలో తహసీల్దార్ పాండునాయక్, బక్కయ్య, నిరంజన్, శ్రీనివాసులు, పవన్ తదితరులతో పాటు స్వేరోస్ నాయకులు రెడ్డపాకుల శివశంకర్ చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాగర్‌కర్నూల్ జిల్లా స్వేరోస్ జాయింట్ సెక్రటరీ సంపత్‌కుమార్, ఆలేటి శివుడు, రాజశేఖర్, ప్రసాద్, మహేష్, సురేష్, మణిందర్ తదితరులు పాల్గొన్నారు. ఉప్పునుంతలలోని పోచమ్మ చౌరస్తాలో మంగళవారం రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. రజక సంఘం నాయకులు లక్ష్మయ్య, సాయిబాబు, కృష్ణయ్య, సైదులు, జంగయ్య విజయ్, ముదిరాజ్ నాయకుడు శ్రీను తదితరులున్నారు. కల్వకుర్తి పట్టణంలోని రజక సంఘం, బీసీ సబ్‌ప్లాన్ బీసీ సాధన కమిటీ ఆధ్వర్యంలో నాయకులు చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, మునిసిపల్ వైస్ చైర్మన్ షాహేద్, ఐలమ్మ విగ్రహ కమిటీ కన్వీనర్ మొగిలి దుర్గాప్రసాద్, బీసీ సబ్ ప్లాన్ సాధన కమిటీ అధ్యక్షుడు మేకల రాజేందర్, జేఏసీ చైర్మన్ సదానందంగౌడ్, నాయకులు పాల్గొన్నారు. పెద్దకొత్తపల్లిలో చాకలి ఐలమ్మ విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రజక సంఘం మండల అధ్యక్షుడు అలీఅక్బర్, సింగిల్ విండో డైరెక్టర్ దండు చంద్రయ్య, బీఆర్‌ఎస్ మండల నాయకుడు బెట్టరి నాగరాజు, మాజీ వార్డు సభ్యుడు డబ్బు ఎల్లయ్య, శ్రీనివాస్‌రెడ్డి, కళాకారుల సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శి తుపాకుల వెంకటేశ్, కళాకారులు పాల్గొన్నారు. బిజినేపల్లి మండలంలోని నందివడ్డెమాన్, పాలెంలోని చాకలి ఐలమ్మ కాంస్య విగ్రహాలకు మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ లావణ్య నాగరాజు, రజక సంఘం నాయకుడు రేమొద్దుల రమేష్‌లు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు ఆర్పించారు. గంగారంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. పంచాయతీ కార్యదర్శులు లింగారెడ్డి, సందీప్, సొప్పరి బాలస్వామి, ఐల రవీందర్‌రెడ్డి, బాల్‌రాంగౌడ్, నాగన్నగౌడ్, వెంకట్, సొప్పరి బాలకృష్ణ, కృష్ణయ్య, శ్రీను, పరుశరాం తదితరులున్నారు. పెంట్లవెల్లిలోని గ్రంథాలయ ఆవరణలో, జటప్రోలులో చిట్యాల ఐలమ్మ చిత్రపటానికి సీపీఎం జిల్లా నాయకుడు ఈశ్వర్ పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు ఎస్ఆర్.హనుమంతు, బి.శ్రీనివాసులు, తిమ్మస్వామి, తరుణ్, ఆంజనేయులు, మహేష్, బాలస్వామి, కురుమూర్తి, సురేష్ తదితరులున్నారు. వంగూరు మండల కేంద్రంతో పాటు, పొల్కంపల్లిలో చాకలి ఐలమ్మ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పొల్కంపల్లిలో ఐలమ్మ విగ్రహానికి, వంగూరులో ఐలమ్మ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో అంకు సురేందర్, లట్టుపల్లి సాయిలు, మురళి, గెల్వయ్య కాశీనాథం తదితరులు పాల్గొన్నారు. కొల్లాపూర్ పట్టణంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి బీఆర్‌ఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెగిన రోడ్లను వెంటనే పునరుద్ధరిస్తాం

- ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి



భైరాపూర్ వద్ద తెగిన రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

వెల్దండ, సెప్టెంబరు 10 : ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, వంతెనలను వెంటనే పునరుద్ధరిస్తామని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని భైరాపూర్ సమీపంలో వర్షాలకు తెగిన రోడ్డు, గాన్గాట్‌తండా వద్ద ప్రమాదభరితంగా ఉన్న వంతెన, బండోనిపల్లి వద్ద తెగిన కేఎల్‌ఐ కాలువలను నారాయణరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులను సమస్య గురించి అడిగి తెలుసుకున్నారు. ఏళ్లకాలంగా భైరాపూర్ వద్ద వంతెన లేకపోవడంతో ప్రతియేటా వరదనీటితో రోడ్డు కొట్టుకునిపోయి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని స్థానికులు ఎమ్మెల్యేకు వివరించారు. వరదనీరు తగ్గిన వెంటనే శాశ్వతంగా సమస్యను పరిష్కరించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. బండోనిపల్లి వద్ద పైపులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

బిల్లులు చెల్లించాలని పాడిరైతుల వినతి : తమకు విజయ డైరీ ద్వారా రావల్సిన పాలబిల్లులను తక్షణమే వచ్చేలా చూడాలని రైతులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు వాపోయారు. సమస్యను పరిష్కరించేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడుతానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నాయకులు భూపతిరెడ్డి, వెంకటయ్య గౌడ్, సంజీవ్‌కుమార్, మోతీలాల్‌నాయక్, నర్సింహ, రషీద్, పుల్లయ్య, రాజు, తిరుపతిరెడ్డి ఉన్నారు.

ప్రతీ సమస్యకు పరిష్కారం

- నాగర్‌కర్నూల్ డీఎంహెచ్‌వో డాక్టర్ స్వరాజ్యలక్ష్మి



వంగూరులో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ స్వరాజ్యలక్ష్మి

కల్వకుర్తి టౌన్/వంగూరు, సెప్టెంబరు 10 : విద్యార్థులు చిన్నచిన్న విషయాలకు ఎక్కువగా ఆలోచించి ఆత్మహత్య చేసుకోవడం సరికాదని, ప్రతీ సమస్యకు పరిష్కారం ఉంటుందని అది గుర్తించి ముందుకు సాగాలని నాగర్‌కర్నూల్ డీఎంహెచ్‌వో డాక్టర్ స్వరాజ్యలక్ష్మి అన్నారు. మంగళవారం కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ రాంరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ప్రపంచ ఆత్మహత్య నివారణ దినోత్సవ కార్యక్రమానికి ఆమె హాజరై, మాట్లాడారు. క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకొని నిండు జీవితాన్ని కోల్పోవద్దని, జీవితం చాలా విలువైనదని ఆత్మహత్య సరైంది కాదని అన్నారు. ఎవరైనా మానసిక ఒత్తిడికి గురైతే టోల్‌ఫ్రీ నెంబరు 14416కు ఫోన్ చేసి నిపుణుల సలహాలు, సూచనలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. వైద్యులు, రోగులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ కె.రవికుమార్‌నాయక్, డాక్టర్ శివరాం, డాక్టర్ భీమానాయక్, డాక్టర్ కృష్ణమోహన్, డాక్టర్ రాధిక, క్లస్టర్ స్టాఫ్ శ్రీనివాస్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు భవాండ్ల వెంకటేష్, అధ్యాపకులు సదానందంగౌడ్, శ్రీనివాస్‌రావు, ఇతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ

వంగూరు : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా వైద్య అధికారి స్వరాజ్యలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రతల గురించి గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి శిబిరాలను నిర్వహించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్ రవికుమార్, రాధిక, డాక్టర్ భీమానాయక్, డాక్టర్ శృతి, సీహెచ్‌వో సుధాకర్ తదితరులున్నారు.

మానసిక సమస్యలే ఆత్మహత్యకు కారణం

లింగాల : మానసిక సమస్యలే ఆత్మహత్యకు కారణాలు అవుతున్నాయని జిల్లా సీజనల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అల్లే శ్రీనివాసులు అన్నారు. మంగళవారం లింగాల మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ ఆశ్రమ పాఠశాల, కళాశాలలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు కల్పించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పలు సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లింగాల ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ శివశంకర్, కళాశాల ప్రిన్సిపాల్ బాలస్వామి, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లాలో 'రోబోటిక్స్ ఇన్ అకడెమిక్స్' ప్రారంభం

- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు శిక్షణ

నాగర్‌కర్నూల్ టౌన్, సెప్టెంబరు 10 : జిల్లాలో ఆసోం అకాడమీ 'రోబోటిక్స్ ఇన్ అకాడెమిక్స్' కార్యక్రమం ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా పది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 7,8,9,10 తరగతుల విద్యార్థులకు రోబోటిక్స్ శిక్షణ అందించనున్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాలలో విద్యార్థులకు రోబోటిక్స్ శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్ మాట్లాడుతూ రోబోటిక్స్ శిక్షణ ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలు పెంపొందుతాయన్నారు. మొదటి విడతలో జిల్లాలోని నాగర్‌కర్నూల్ జడ్పీహెచ్‌ఎస్ బాలుర, నాగనూల్ కేజీబీవీ, జిల్లా కేంద్రంలోని టీజీడబ్ల్యూఆర్‌ఎస్ బాలుర, జడ్పీహెచ్‌ఎస్ బిజినేపల్లి ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 342 మంది విద్యార్థులకు ఈ శిక్షణలో పాల్గొననున్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ ఏఎంవో షరీఫుద్దీన్, హెచ్‌ఎం, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రోబోటిక్స్ శిక్షణలో ప్రయోగాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



రోబోటిక్స్ అకడమిక్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు

పీజీ రెండవ సెమిస్టర్ పరీక్ష వాయిదా

కొల్లాపూర్, సెప్టెంబరు 10 : పాలమూరు యూనివర్సిటీ పీజీ సెంటర్ కొల్లాపూర్‌లో బుధవారం జరగాల్సిన పీజీ రెండవ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మార్క్‌పోలోనియస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ పరీక్ష యథావిధిగా జరుగుతుందని, విద్యార్థులు గమనించాలని ఆయన పేర్కొన్నారు.

'చారకొండ రోడ్డుకు మరమ్మతులు చేయాలి'

చారకొండ, సెప్టెంబరు 10 : మండల కేంద్రం నుంచి మర్రిపల్లి వరకు పూర్తి గుంతలమయంగా మారిన మూడు కిలోమీటర్ల ప్రధాన రహదారికి మరమ్మతులు చేయాలని కాంగ్రెస్ నాయకులు మంగళవారం హైదరాబాద్‌లో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణను వినతిపత్రాన్ని అందజేశారు. ప్రధాన రహదారి గతుకుల మారడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు వినతిలో పేర్కొన్నారు. కార్యక్రమంలో అచ్చంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండె వెంకట్‌గౌడ్, మండల అధ్యక్షుడు జమ్మికింది బాల్‌రాంగౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ జగన్ మోహన్, గజ్జె కొండలయ్యగౌడ్, సహదేవ్, రవి తదితరులున్నారు.

'ఎస్సీ హాస్టల్ పాత భవనాన్ని ఆట స్థలంగా మార్చాలి'

బల్మూరు, సెప్టెంబరు 10 : మండల కేంద్రంలో ఉన్న ఎస్సీ బాలుర వసతిగృహం శిథిలావస్థకు చేరిందని, హాస్టల్‌ను నేలమట్టం చేసి విద్యార్థులకు ఆడుకునే ఆట స్థలంగా మార్చాలని సీపీఎం మండల కార్యదర్శి శంకర్‌నాయక్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఉన్న ఎస్సీ బాలుర హాస్టల్‌ను సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం పరిశీలించి, సమస్యలను అధ్యయనం చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు ఎండి.లాల్‌మహ్మద్, ఖాసీమామ్, కృష్ణయ్య, మాసయ్య, బక్కయ్య, చిన్నయ్య, భరత్‌ప్రసాద్ తదితరులున్నారు.

జూపల్లి, గోకారం గ్రామాల అభివృద్ధికి సహకరించాలి

చారకొండ, సెప్టెంబరు 10 : మండలంలోని జూపల్లి, గోకారం గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు మంగళవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. జూపల్లి, గోకారం గ్రామాల అభివృద్ధికి సహకరించాలని వారు తిరుపతిరెడ్డిని కోరారు. కాంగ్రెస్ నాయకులు బాలెమియ, కొండల్, బాలరాజు, భాస్కర్‌రెడ్డి తదితరులున్నారు.

ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

కల్వకుర్తి టౌన్, సెప్టెంబరు 10 : ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో బుధవారం నిర్వహించనున్న ఉద్యోగ మేళాను జిల్లా వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కల్వకుర్తి ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ జయమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరుణ్ మోటార్స్ హైదరాబాద్, శ్రీవిజయ బయో ఫర్టిలైజర్స్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ వారి ద్వారా 100 ఉద్యోగ ఖాళీల భర్తీకి ఉద్యోగ మేళా నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఉద్యోగ మేళా ఉదయం 11:30 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చి నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు వేతనం నిర్ణయించినట్లు ఆయా కంపెనీలు తెలిపినట్లు ప్రిన్సిపాల్ వివరించారు.

శ్వేతారెడ్డికి ఘనంగా నివాళి

ఊర్కొండ, సెప్టెంబరు 10 : మండల కేంద్రంలోని కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారి వద్ద మంగళవారం బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే డా.సి.లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ శాంతకుమారి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వీరారెడ్డి, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, బీజేపీ నాయకులు ముచ్చర్ల జనార్దన్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.